క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఓటర్ నమోదు పత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్

శంకరపట్నం: మండలకేంద్రంలోని పోలింగ్ బూత్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ అనుపమ పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మారెడ్డి, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

శంకరపట్నం : మండలంలోని తాడికల్‌లోని సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈ సంపత్ రెడ్డి తెలిపారు. శంకరపట్నం, వీణవంక, సైదాపూర్ మండలంలోని వినియోగదారులు సదస్సుకు హాజరుకావాలని ఏఈ కోరారు.

నియామకం



శ్రీకాంత్

గన్నేరువరం: ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పారువెల్ల గ్రామానికి చెందిన అడ్వకేట్ లింగంపల్లి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్, జిల్లా ఇన్‌చార్జి థామస్, జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్‌కు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటా మట్టి సేకరణ



మట్టి సేకరిస్తున్న నాయకులు

శంకరపట్నం : ఆజాదికా అమృత్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అంబాల్‌పూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఇంటింటా తిరుగుతూ మట్టి సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగు అని, కార్యకర్తలు, జగ్గారెడ్డి, శ్రీనివాస్, గట్టయ్య, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

హుజూరాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, బస్టాండ్ ఆవరణలో ఆదివారం కల్కి భగవాన్ భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కిషన్‌రెడ్డి, లక్ష్మీ, దేవి, రజిత, చంద్రకళ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన



చొప్పదండి: పట్టణంలోని ఐకేపీ కార్యాలయం ముందు మహిళా స్వశక్తి మహిళా సంఘం భవనానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆదివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్వశక్తి మహిళా సంఘం భవన నిర్మాణం కోసం రూ. 7.60 లక్షలు మంజూరు చేయించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఏడీఎంసీ మానస, రిసోర్స్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర: ఈ నెల 9న నిర్వహిస్తున్న నేషనల్ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఈనెల 9 వరకు కార్యక్రమం కొనసాగుతుందని, పలు కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు.

మురుగుకాలువ లేక తంటాలు

- మండలకేంద్రంలో ప్రధాన రోడ్డువెంట లేని మురుగు కాలువ
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- చిన్నపాటి వర్షానికే రోడ్డంతా చిత్తడి..
- సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి



ఇరువైపులా మురుగు కాలువ లేని ప్రధాన రహదారి

రామడుగు: మండలకేంద్రంలోని ప్రధాన రహదారి వెంట మురుగు కాలువ లేకపోవడంతో గ్రామస్తులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోచమ్మ ఆలయ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఇరువైపులా మురుగునీటి కాలువను అధికారులు నిర్మాణం చేయకపోవడంతో మురుగునీరంతా రోడ్డు వెంబడి నిలిచిపోతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మించినా..

మండలకేంద్రంలోని పోచమ్మ ఆలయ చౌరస్తా నుంచి జెడ్పీ పాఠశాల గేటు ముందు వరకు సీసీరోడ్డు వేశారు. అయినా రోడ్డుకిరువైపులా మురుగునీటి కాలువ నిర్మించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఇళ్ల యజమానులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి వెంట దాదాపు కిలోమీటర్ మేర పరిస్థితి ఇలాగే ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

మండల కేంద్రమైనా..

మండలకేంద్రమైనా ప్రధాన రహదారి వెంబడి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ప్రధాన రోడ్డుగుండా వెంటనే లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వర్షం పడితే చిత్తడే..

చిన్నపాటి వర్షానికే ప్రధాన రోడ్డు వెంబడి వర్షపు నీరు నిలిచి వెళ్లడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇళ్లల్లో మురుగునీరు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం నిధులు మంజూరుచేసి ప్రధాన రోడ్డుకిరువైపులా మురుగు కాలువలను నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలోని ప్రధాన రోడ్డుగుండా మురుగు నీటి కాలువ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్డు నిర్మించినా ఇరువైపులా అధికారులు డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరుచేసి మురుగు కాలువతోపాటు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించాలి.

– బర్కత్ అలీ, రామడుగు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రామడుగులోని ప్రధాన రోడ్డు వెంట మురుగు కాలువ లేని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ రోడ్డు ఆర్అండ్‌బీ పరిధిలో ఉండడంతో ఆ శాఖ అధికారులు నిధులు కేటాయించి చేయాల్సి ఉంటుంది. ప్రజల సమస్యను గుర్తించి అధికారులు మురుగునీటి కాలువ నిర్మించాలి

– పంజాల ప్రమీల, జగన్‌మోహన్ గౌడ్, సర్పంచ్

పల్లెల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

- లింగాపూర్‌లో సమస్యలు పరిష్కరిస్తాం
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్ రూరల్: పల్లెలు అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఇటీవల రూ.25లక్షల నిధులతో నిర్మించిన ఎస్సీ, రజక, యాదవ, సంఘం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అరవై ఏళ్లో గత పాలకులు చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ పార్టీ చేసిందన్నారు. బుడగజంగాల వర్గానికి చెందిన వారికి గృహలక్ష్మి పథకం ద్వారా అదనంగా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. గ్రామంలోని నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీధర్ రావు, జెడ్పీటీసీ శేఖర్, ఎంపీటీసీ కవిత, సంఘాల అధ్యక్షులు ఆంజనేయులు, విశ్వనాథం, వీరేశం, సంపత్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ విద్యుత్ తీగలు తొలగించాలని వినతి

మండలంలోని లింగాపూర్‌లో పలు శంకుస్థాపనకు వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో రాంనగర్ పల్లె వాసులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రసమయి విద్యుత్ ఏఈ ఫసియొద్దీన్‌తో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

సభకు తరలిన పద్మశాలీలు



శంఖారావ సభకు తరలుతున్న పద్మశాలీ సంఘం బాధ్యులు

హుజూరాబాద్ : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన పద్మశాలీ శంఖారావం సభకు ఆదివారం పద్మశాలీ సంఘం బాధ్యులు, పద్మశాలీ కుల బాంధవులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో చేనేత సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ఉపాధ్యక్షుడు వేముల యాదగిరి, చేనేత సహకార సంఘం మేనేజర్ నక్క వైకుంఠం, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, ఉపాధ్యక్షుడు సబ్బని రాజేందర్, జిల్లా కార్యదర్శి వొల్లల కృష్ణహరి, పద్మశాలీ సంఘం బాధ్యులు వేముల యాదగిరి, సంగెం అయిలయ్య, సబ్బని మొగిళి, వీడెపు రాజు, సబ్బని రాజేందర్, ఆడెపు శ్రీనివాస్, బండారి సదానందం, మార్కండేయ తదితరులున్నారు.



సభకు తరలివెళ్తున్న పద్మశాలీలు

శంకరపట్నం : జనాభా దామాషా ప్రకారం రాజకీయాల్లో తమకు వాటా తమకు అవకాశం కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పద్మశాలీ శంఖారావం కార్యక్రమానికి మండలంలోని పద్మశాలీలు పెద్దఎత్తున హైదరాబాద్ తరలివెళ్లారు. కార్యక్రమంలో రవీందర్, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, రఘుపతి, దామోదర్, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన యాదవ సంఘం నాయకులు



ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

చిగురుమామిడి: రెండో విడతగా 67 గొర్రెల యూనిట్లు మంజూరైనందుకు గాను మండలానికి చెందిన గొల్ల కుర్మ యాదవ సంఘం సభ్యులు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను ఆదివారం హుజూరాబాద్ మండలంలోని సింగపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు గొంగడి కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల కోడ్ రాకముందే యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. సత్వరమే డీడీలు కట్టాలని, కలెక్టర్‌తో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాదవ సంఘం అధ్యక్షుడు ముక్కెర సదానందం యాదవ్, ఉపాధ్యక్షుడు మల్లేశం యాదవ్, ప్రధాన కార్యదర్శి అన్న సమ్మయ్య యాదవ్, డైరెక్టర్లు చొదరి మనోజ్‌కుమార్, పోతరవేని అనిల్, కాశవేని రాజు, మహేశ్వరి, చౌదరి లావణ్య, తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సన్‌షైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, వైద్యసిబ్బంది, మార్కెట్ బీడీఎం నాగరాజు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రాంమచంద్రం, విజయ్ కుమార్, వెంకటేశ్, ఫార్మాసిస్ట్ సాగర్, ల్యాబ్ టెక్నీషియన్స్, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారం

గన్నేరువరం: మండలకేంద్రంలో ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి పాత గ్రామ పంచాయతీ వద్ద ఎలుగుబంటిని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై చందా నరసింహారావు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి ఎలుగుబంటికి సమీపంలో ఉండగా ఎస్సై వాహనం సైరన్ వేయడంతో వెనక్కి వెళ్లిపోయింది. మూడ్రోజులుగా గ్రామ శివారులో ఎలుగుబంటి సంచరిస్తోందని గ్రామస్తులు తెలుపుతున్నారు. కాగా పోలీసులు గ్రామస్తులను అప్రమత్తం చేయడంతోపాటు ఎవరు ఇళ్లలోంచి బయటకు రావద్దని సూచించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కరీంనగర్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఆదివారం ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి పైబడిన వారందరినీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా చూడాలని కోరారు. 20 ఏళ్లుగా చాలా మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. సరైన ఉద్యోగ భద్రత లేదని, ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని కోరారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, జూన్ 2023 నాటికి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల జీతాలను తక్షణమే చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వాడి సంధ్య, సమంత, కమల్, రవీందర్‌గౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు జీవం..



వీణవంక: నెలరోజుల నుంచి వరుణుడు ముఖం చాటేయగా ఆదివారం కురిసిన వర్షంతో పంటలకు జీవం పోసినట్లయింది. జూలై చివరి వారంలో భారీ వర్షాలు కురువగా చెరువులు, కుంటలు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. కొన్నిచోట్ల చెరువులు, చెక్‌డ్యాంలకు గండ్లు పడగా రోడ్లు కొట్టుకుపోయాయి. ఆగస్టు నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి, ఇతర పంటలు మాడిపోయాయి. నెలరోజుల తర్వాత వర్షం కురవడంతో దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలుండగా 36 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి.

‘దళిత యువకులను హింసించిన వారిపై చర్యలు తీసుకోవాలి’



సాంబారి కొంరయ్య

చిగురుమామిడి: మంచిర్యాల జిల్లా మందమర్రిలో దళిత యువకులను చిత్రహింసలు పెట్టి తీవ్రంగా కొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబారి కొంరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందమర్రికి చెందిన చాకలి రాములు తన మేకను దొంగతనం చేశాడనే నెపంతో దళిత యువకులైన తేజ, కిరణ్‌లను తలకిందులుగా వేలాడదీసి చిత్రహింసలు పెట్టారని, రాములు, అతని కుటుంబ సభ్యులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాములు పెట్టిన చిత్రహింసలు తట్టుకోలేక కిరణ్ అదృశ్యమయ్యాడని, ఏదైనా జరిగితే రాములే పూర్తి బాధ్యత వహించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులపై ఇలాంటి దాడులు కొనసాగితే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన అలువాల తార అనారోగ్యంతో మృతిచెందగా భర్త వెంకటేశ్ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కరీంనగర్ 44వ డివిజన్ కార్పొరేటర్ మెంది శ్రీలత చంద్రశేఖర్ రూ.10 వేలతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఇక్కడ అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గొర్రె వాసు, సాయి, తదితరులున్నారు.

హామీలు నెరవేర్చాలి

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా కాలయాపన చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4, 5 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 7న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువకులు ఆశగా ఎదురుచూస్తున్నారని, ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమవుతున్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపర్చి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. 4 నుంచి జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సంపత్, ఎడ్ల రమేశ్, నాయకులు గజ్జల శ్రీకాంత్, అరవింద్ పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ గెలుపు ఖాయం’

వీణవంక: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాకలో ఆదివారం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీఆర్ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నాయని, ఆ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. గతంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా నియమితులైన తర్వాత గ్రామాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కౌశిక్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



చైర్మన్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

శంకరపట్నం: రాష్ట్రంలోని మత్స్యకార్మిక సంఘాల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యకార్మిక సంఘం చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ముదిరాజ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్యకార్మికులకు ఏపదవి రాలేదని ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ఒరిస్సాలో మాదిరిగా ఎల్ఎండీ కాలువను పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపల పెంపకానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి చేపపిల్లలు పంపిణీ చేస్తామని, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కీసర సంపత్, ప్రభాకర్, తిరుపతి, సమ్మయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

‘మైనారిటీ బంధు’లో అవకతవకలు

కరీంనగర్ టౌన్: జిల్లాలో ముస్లింలకు అందిస్తున్న మైనారిటీ బంధులో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కోటి ఆశలతో వందల రూపాయలు ఖర్చు పెట్టి మైనార్టీ బంధు కోసం పేద ముస్లింలు దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం ఇస్తుందనుకున్న రూ.లక్ష కాస్త అనర్హులకు చేరుతున్నాయని విమర్శించారు. దీనిని సమాచార హక్కు చట్టం ద్వారా బహిర్గతం చేస్తామన్నారు. బంధులన్నీ బీఆర్ఎస్ పార్టీ, ఎంఐఎం పార్టీ నాయకులు తీసుకుంటే ఇక ప్రభుత్వం దరఖాస్తులు ఎందుకు స్వీకరించాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా మైనార్టీ బంధును అర్హులైన పేద ముస్లింలకు అందించేలా చూడాలని కోరారు.

‘జయప్రదం చేయండి’

కరీంనగర్: ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద టీడీపీ నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని అన్నారు.